GSTIN-NO:36FKPSI306PIZX
epaper:tmedia.net.in
టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
ఖమ్మం-భద్రాద్రి
సూర్యాపేట
ఆదివారం ,
జులై 20, 2025
పేజీలు 3

# పిడుగుపాటుకు రైతు మృతి



**టీ మీడియా,జులై19,చంద్రుగొండ,:** పిడుగుపాటుకు రైతు మృతి చెందిన సంఘటన శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం వెంకటాయతండా గ్రామంలో చోటుచేసుకుంది. చంద్రుగొండ మండలం వెంకటయతండా గ్రామానికి చెందిన రైతు బానోతు రవి (38) తన పత్తి చేనులో అరకతో పైపాటు చేస్తుండగా శనివారం సాయంత్రం వేళలో ఉరుములతో కూడిన వర్షం అకస్మాత్తుగా ప్రారంభమైంది. ఈ క్రమంలో పంట చేనులో ఉన్న రైతు బానోతు రవిపై పిడుగు పడిపోయాడు. వెంటనే తోటి రైతులు గ్రామస్తులు కలిసి హుటాహుటిన చంద్రుగొండలోనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రవికి భార్య కవిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు, తోటి రైతులు కోరుతున్నారు.

ఏపీలో వెలగబెట్టింది చాలక తెలంగాణలోనూ విచ్చలవిడి అక్రమాలు , ఖమ్మంలో ఎన్నారై భూములపై కన్నేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ల పరంపర , అమ్ముడుపోయిన ఆర్బీఐ నిబంధనలు.. యధేశ్చగా కోర్టు ధిక్కరణ , ఏపీలో గత ప్రభుత్వ పెద్దల తాలూకా మనిషినంటూ బరితెగింపు , ఇప్పుడు ఖమ్మాన్ని తాకిన ఆంధ్రా రియల్ ఎస్టేట్ విష సంస్కృతి , తొలుత రిజిస్ట్రేషన్.. ఆనక 60-40 పర్సెంటేజీతో సెటిల్మెంట్ , కొత్త తరహా సెటిల్మెంట్లకు బొడ్డు కోసిన "కొత్తా దేవుడండీ"! ,నయీమ్ తరహా నయా దందాతో వణికిపోతున్న ఖమ్మం నడి బొడ్డు , ఆంధ్రా , తెలంగాణ రాష్ట్రాల నడుమ ఉన్న ఖమ్మం జిల్లా రెండు రాష్ట్రాల మిశ్రమ సంస్కృతికి పెట్టింది పేరు..

# నయా నయీమ్



## -భూ బకాసురుడి "ప్రవీణు"డు

## -60-40 పర్సెంటేజీతో సెటిల్మెంట్

**టి మీడియా, జులై 19,ప్రత్యేక ప్రతినిధి:** కమ్యూనిస్టులకు కంచుకోటగా చెప్పుకునే ఖమ్మం గడ్డ రాజకీయ చైతన్యానికి నిజంగా ఓ కొలమానమే.. అలాంటి జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగానికి అమితమైన ప్రాధాన్యం ఉంది.. అయితే భూ వ్యాపారం నేలను విడిచి ఆకాశాన్ని తాకిన రోజుల్లోనూ ఇక్కడ నిబంధనల ఉల్లంఘన తలెత్తింది లేదు.. కాగా ఖమ్మం రియల్ ఎస్టేట్ లో నయీమ్ మాదిరి ఆగడాలకు బరితెగిస్తున్నాడు.. మునుపెన్నడూ లేని చందంగా ఖమ్మంలో నయా విష సంస్కృతికి పురుడు పోశాడు.. ఇక్కడి ఎన్నారై భూములపై కన్నేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని కోట్లల్లో సెటిల్మెంట్ కు తెర లేపాడు . ఆంధ్రప్రదేశ్ లో జగన్ సర్కారు కొలువై ఉన్నప్పుడు నాటి ప్రభుత్వ పెద్దల పేర్లను ఎంచక్కా వాడుకున్న ఈ ప్రబుద్ధుడు అటు ఆంధ్రాలో ఇటు హైదరాబాద్ లో రియల్ దందా సాగించాడు. సీఎం పేషీలో ప్రముఖుల పేర్లు వల్లెవేస్తూ రియల్ ఎస్టేట్ పైరవీలు నడిపాడు. ఇప్పుడు దినదినాభివృద్ధి చెందుతున్న ఖమ్మంపై అతగాడి దృష్టి పడింది.. "కోర్టు వివాదంలో ఉన్న భూములైనా.. ఎన్నారైలకు చెందిన భూమి అయినా.. పోరంబోకు భూములైనా..

మిగతా 3లో

# ప్రారంభమైన సిపిఐ మహాసభలు

**-అరుణ పతాకాన్ని ఆవిష్కరించిన పువ్వాడ**

**-అరుణవర్ణమైన మధిర పుర వీధులు**

**టీ మీడియా,జులై19, మధిర :**

సిపిఐ ఖమ్మం జిల్లా 23వ మహాసభలు శనివారం పోటుప్రసాద్ నగర్(రెడ్డి గార్డెన్స్) లో ఘనంగా ప్రారంభమయ్యాయి. 20 మండలాలతో పాటు ఖమ్మం నగరం, మూడు మున్సిపాలిటీలకు ప్రాతినిధ్యం వహిస్తూ 600 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రతినిధులంతా ఎర్రచొక్కాలు, ఎర్ర చీరలు –ధరించి రావడంతో మహాసభ ప్రాంగణం అరుణ వర్ణాన్ని పులుముకుంది. ఉ.8 గం. నుండే ప్రతినిధుల –నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. మహాసభలో ప్రారంభ సూచికగా సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్సి పువ్వాడ నాగేశ్వరరావు అరుణపతాకాన్ని ఆవిష్కరించగా, అమరవీరుల స్మారక జ్యోతిని –మహ్మద్ మౌలాన జోహార్ జోహార్ అనే నినాదాల నడుమ ప్రారంభించారు. గత మహాసభలు జరిగిన వైరా నుండి అఖిలభారత యువజన సమాఖ్య కార్యకర్తలు అమర జ్యోతిని తీసుకురాగా, సిపిఐ నాయకులు ఆ జ్యోతి ని అందుకున్నారు. మహాసభల ప్రారంభం కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, ఎంఎల్సి నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి



ఎస్కే సాబీర్ పాషా తదితరులు పాల్గొనగా, సంతాప తీర్మాణాన్ని సిద్దినేని కరుణ కుమార్ ప్రవేశపెట్టారు. మహాసభల –ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా వ్యవహరించిన కర్ణాటి రామ్మోహన్ రావు అధ్యక్షోపన్యాసాన్ని చేశారు. కార్యదర్శి నివేదికను జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ప్రవేశపెట్టారు. సభ ప్రారంభానికి ముందు –అధ్యక్ష వర్గం తీర్మాణాల కమిటీ మహాసభల స్టీరింగ్ కమిటి అర్హతల కమిటి మినిట్స్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రతినిధుల ఆమోదాన్ని తీసుకున్నారు. రెండ్రోజుల పాటు జరగనున్న సభల్లో తొలిరోజు పలు తీర్మాణాలు ఆమోదం పొందాయి. వివిధ మండలాలు, పట్టణ బాధ్యులు కార్యదర్శి నివేదికపై చర్చల్లోపాల్గొన్నారు. అధ్యక్ష వర్గంగా జమ్ముల జితేంధర్ రెడ్డి, మందడపు రాణి, అజ్మీరా రామ్మూర్తి, దొండపాటి రమేష్, మేకల శ్రీనివాసరావు, ఎంగల ఆనందరావు వ్యవహరించారు.

# డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన

**-ప్రత్యేక స్టాల్ ద్వారా విక్రయాలు**

**టి మీడియా, జూలై 19,పినపాక ప్రతినిధి:**మణుగూరు మున్సిపాలిటీలోని మెప్మా, ఆధ్వర్యంలో స్వయంశక్తి సంఘాలు తయారుచేసిన విక్ర యిస్తున్న ఉత్పత్తులు పలువురి ని ఆకట్టుకుంటున్నాయి. శనివా రం పట్టణంలోని పూల మార్కెట్ చౌరస్తాలో స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రత్యేక స్టాల్ ను ఏర్పాటు చేసి పలురకా ల చేతి ఉత్పత్తులను ప్రదర్శించి అమ్ముతున్నారు. స్టాల్ లో ప్రత్యే క ఆకర్షణలు పలురకాల ఉత్ప త్తులైన, జూట్ బ్యాగ్స్, మేదరి వస్తువులు, చేనేత వస్త్రా లు, హెర్బల్ ఆయిల్స్, సబ్బులు, వివి ధ రకాల పచ్చళ్ళు, సమోసా లు, అల్లికలు, లిప్రాన్ వర్క్ తో తయారు చేసిన మెమెంటోలు,వంటి పలురకాల ఉత్పత్తులు ఈ ఈ



స్టాల్ లో అందుబాటులో ఉన్నాయి. పలు ఉత్పత్తులు ఇక్కడ ఆకర్షణగా నిలుస్తున్నా యి.మండలంలోని పలుస్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ విక్రయించడంతో పాటు చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఆహార పదార్థాలు, మార్కెట్ రేటు కంటే ఇక్కడ తక్కువ ధరలకు అమ్ముతున్నారు.

## ఇందిరా మహిళా శక్తి సంబరాలు

**టీ మీడియా,జులై19,వైరా :** ఖమ్మం జిల్లా వైరా మండల కేంద్రంలో వైరా నియోజకవర్గ స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబురాలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, రుణాల బీమా, ప్రమాద బీమా చెక్కులు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి, కొణిజర్ల, వైరా, జూలూరుపాడు, ఏన్కూరు మండలాలకు చెందిన అధికారులు, ఐకెపి సిబ్బంది, గ్రామ సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శిలతో పాటు డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

**టి మీడియా, జులై 19, పినపాక ప్రతినిధి:**

అప్పు లేదన్నందుకు వైన్ షాప్ క్యాషియర్ పై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి అశ్వాపురం సిఐ జి అశోక్ రెడ్డి తెలిపిన వివరాలిలా వున్నాయి.మండల పరిధిలోని మొండికుంట వైన్స్ షాప్ లో శుక్రవారం రాత్రి క్యాషియర్ తోట వేణును, అదే గ్రామానికి చెందిన నగునూరు దుర్గాప్రసాద్ విపరీతంగా మద్యం సేవించి అప్పు ఇవ్వాలని అడు గగా,లేదన్నందుకు క్యాషియర్ పై బాటిల్ లో పెట్రోల్ తీసుకుని వచ్చి అక్కడ ఉన్న వారిపై పెట్రోల్ పోసి హత్యా యత్నానికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ప్రసాద్ పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి శనివారం రిమాండ్ కు తరలించారు.



## కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని వినతి

**టీ మీడియా, జులై 19 ,పాలేరు ప్రతినిధి:**

తిరుమలాయపాలెం మండలం కేశవపురం గ్రామంలో సీతారామ కెనాల్ నిర్మాణ సందర్భంగా అక్కడ ఉన్నటువంటి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ని వేరే చోట మార్చి కొంతకాలం రైతులకు కరెంట్ అందించిన అధికారులు. ఇప్పుడు అక్కడున్నటువంటి ట్రాన్స్ఫార్మర్ ని తొలగించి కేశపురం రైతులకు ఇబ్బంది గురి చేస్తున్నారని ఖమ్మం సూపర్డెంట్ ఇంజనీర్ నీ కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు. ఏఐయుకేఎస్ రాష్ట్ర నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు కేశవపురం రైతులతో కలిసి విద్యుత్ ఎస్సీ కి గతంలో ఉన్నటువంటి ట్రాన్స్ఫార్మర్ ని కెనాల్ కు రెండు వైపులా ఏర్పాటు చేసి కేనల్ కాంట్రాక్టు పని అయిపోగానే ట్రాన్స్ఫార్మర్ తీసుక పోవడం వల్ల ఈ వర్షాకాలం సీజన్లో రైతులు పంట పొలాలు చేసే పరిస్థితిలేనందున తక్షణమే ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎస్సీ నీ కోరారు. ఎస్సీ స్పందించి సీతారామ ప్రాజెక్టు కాంట్రాక్టర్ తో మాట్లాడి వెంటనే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం లో తిరుమలయపాలెం తాసిల్దార్. ఎంపీడీవోలకు. విద్యుత్ ఏఈ ల కు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని పై అధికారుల దృష్టికి పోయేదాకా విద్యుత్ శాఖ అధికారులు రైతుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరైనది కాదని కోలేటి నాగేశ్వరరావు. కమ్మ కోమటి నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డ వెంకన్న. మండల వెంకటేశ్వర్లు. దొడ్డ రామయ్య. మరియమ్మ. వెంకటేశ్వర్లు. ఎం ఉపేందర్. దొడ్డ కోటయ్య. ఉప్పలమ్మ. రామచంద్రయ్య తదితరులు.



## ఎన్నికల్లో సీపీఎం సత్తా చాటాలి

**-మండల కార్యదర్శి కొమ్ము శ్రీను**

**టీ మీడియా ,జులై 19, పాలేరు ప్రతినిధి:**

తిరుమలాయపాలెం మండల కేంద్రంలో గజ్జల వెంకటయ్య భవన్లో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సమావేశం బింగి రమేష్ అధ్యక్షతన జరిగింది ఈ యొక్క సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలంలో రాబోయే ఎన్నికల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం ఐ అభ్యర్థులు చత్తాచాటాలని ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఎం పార్టీ అభ్యర్థులను ప్రజల ఆదరించాలని నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్న పార్టీ సీపీఎం అని తిరుమలాయపాలెం మండలంలో అన్ని గ్రామాలలో సీపీఎం పోటీ చేస్తున్నట్లు సీపీఎం పార్టీని ఆదరించాలని ఆయన పిలుపునిచ్చారు అట్లాగే వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ 26వ తారీకు మండల కేంద్రంలో జరుగుతుందని రైతు సంఘం మండల మహాసభలు జరుగుతున్నాయని ప్రజాసంఘాల మండల మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరావు పద్మనాభుల సుధాకర్ రావు బింగి రమేష్ దాసరి మహేందర్ వేగినాటి మంగతాయి అంగిరేకుల నరసయ్య కొత్తపల్లి వెంకన్న కొమ్ము నాగేశ్వరరావు వెంకటేష్ దొడ్డలింగస్వామి మండల పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం మహిళలందరికి ఇవ్వాలి



**-కొండబోయిన నాగేశ్వరరావు**

**టీ మీడియా,జులై19,సింగరేణి(కారేపల్లి) :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు మరిచి అంతా చేశామని చెప్పుకుంటుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. శనివారం కారేపల్లి మండలం బక్కలతండాలో వ్యవసాయ కార్మికలతో జనరల్ బాడీసమావేశం జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమి లేని పేదలకు ఇందిరమ్మ అత్మీయ భరోసా రూ.12వేలు, మహాలక్ష్మి పథకంలో మహిళలకు రూ.2500 ఊసే ఎత్తటం లేదని పెన్షన్ల పెంపు పై ప్రభుత్వం అలోచిస్తున్నట్లు లేదన్నారు. రైతులకు సైతం రూ.2లక్షల రుణమాఫీ అంటూ సగం మందికే ఇచ్చి పూర్తి అయ్యాయని పేర్కొనటం రైతులను మోసగించటమేనన్నారు. యాంత్రాలు, కలుపు మందులతో వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా పోయాయన్నారు. కూలీలకు ఉపాధీపనులు 200 రోజుల కల్పించటం ,రోజు కూలి రూ. 600 చెల్లించి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. పేదలకు రేషన్ కార్డులు ఇచ్చి, ప్రజాపంపిణి వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువులను అందించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టే కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యకాస నాయకులు బానోత్ శ్రీను, అజ్మీర వినోద్, మాలోత్ బాలు, ముఠామేస్త్రి వాంకుడోత్ పిచ్చమ్మ, శాంతి, లాలమ్మ, బంగారి తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ రహిత సమాజం ర్యాలీ.

**టీ.మీడియా,జూలై19,చింతూరు:**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత సమాజం కొరకు ప్లకార్డులు, నినాదాలతో ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. కె. రత్న మాణిక్యం ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై కీలక సందేశాన్ని ఇచ్చారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసేందుకు శతాబ్దాలు పడతాయి. అవి నేల నీరు వాతావరణాన్ని కలుషితం చేస్తాయి. విద్యార్థినీ విద్యార్థులు ఇప్పటినుంచి ఈ విషయాన్ని తెలుసుకొని ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో, మెయిన్ రోడ్ లో పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.సాయికుమార్, సీనియర్ అధ్యాపకులు జి. వెంకట్రావు, ఎస్ అప్పనమ్మ, జి. హారతి, కె.శకుంతల, కె. శైలజ, ఎం నాగ మోహన్ రావు,బి. శ్రీనివాస రావు, ఆర్.మౌనిక,పి. మౌనిక, ఎన్ వి వి ఎస్ ఎన్ మూర్తి, సంగం నాయుడు, శీనయ్య, సుబ్బారావు, కన్నయ్య విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## ఐదు కేజీల గంజాయి పట్టివేత

**-ముగ్గురు వ్యక్తుల అరెస్టు**

**టీ మీడియా,జూలై19.చింతూరు:**

అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్, చింతూరు ఏ ఎస్ పి పంకజ్ కుమార్ మీనా ఆదేశాల మేరకు, చింతూరు సిఐ తెల్లం దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై పి రమేష్ శుక్రవారం చింతూరు పోలీస్ స్టేషన్ ముందు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒరిస్సా నుండి తెలంగాణ రాష్ట్రానికి కారులో తరలిస్తున్న ఐదు కేజీల గంజాయి పట్టుకున్నారు. ఈ కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు. మద్దాయిలు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లి మండలం కారుకొండ రామవరం గ్రామానికి చెందిన మాలోత్ సాయినాథ్, చంద్రుగొండ మండలం తుంగారం గ్రామానికి చెందిన నోముల రామకృష్ణ, వేల్పుల రాము లను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద ఉన్న సెల్ ఫోన్లు, ఆధార్ జిరాక్స్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.వీరిని కోర్ట్ లో హాజరు పరచ నున్నట్లు యస్. ఐ తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ 25 వేల రూపాయలు ఉంటుందన్నారు. గంజాయి అక్రమ రవాణాకు రాత్రింబవళ్లు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పారెస్టు దాడులు అభ్యంతకరం

**పోడుదారుల సమస్య పరిష్కరించాలి**



**టీ మీడియా,జులై19, సింగరేణి (కారేపల్లి) :**

ప్రభుత్వం పోడుదారుల జోలికి వెళ్లవద్దని చెప్పుతున్నా, పేదలపై పారెస్టు దాడులు కొనసాగిస్తూనే ఉందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వై.ప్రకాశ్ విమర్శించారు. శనివారం కారేపల్లి మండలం పేరుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాణిక్యారం – ఎర్రబోడు మహిళా పోడుదారులపై మగ సిబ్బంది దాడులకు దిగటం విచారకరమన్నారు. దీనిపై న్యాయ విచారణచేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్లాంటేషన్ కోసం సాగు చేస్తున్న పోడును ప్రత్యామ్నాయంగా పోడు చూపుతామని హామి ఇచ్చి ప్లాంటేషన్ చేసిన తర్వాత దానిని విస్మరించటం తగదన్నారు. పోడు సమస్యను జఠిలం చేయకుండా సామరస్య ధోరణిలో పరిష్కరించాలని ఫారెస్టు ఉన్నతాధికారులను కోరారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు న్యూడెమోక్రసీ పేదల పక్షాన నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో పీవోడబ్ల్యూ మండల కార్యదర్శి వై.జానకి, ఎన్డీ నాయకులు కంచర్ల శ్రీనివాసరెడ్డి, కోయల శ్రీను, ఆలెం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు



**టీ మీడియా,జులై19, సింగరేణి (కారేపల్లి) :**

కారేపల్లి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఇంటర్ లో ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 22న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ జీ.ఝాన్సీసౌజన్య తెలిపారు.శనివారం విలేకరులతో మాట్లాడుతూ తెలుగు, అంగ్లమాధ్యంలో కలుపుకోని ఎంపీసీలో 8, బైపీసీలో 8 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఈ సీట్ల భర్తీలో తల్లిదండ్రులు లేని వారు, ఒకరే సంరక్షకులు ఉన్నవారు, దివ్యాంగ కుటుంబాలకు చెందిన వారు, పేద విద్యార్థులకు ప్రాధాన్య ఇస్తున్నట్లు తెలిపారు. అసక్తిగల విద్యార్థులు ఈనెల 22న విద్యాలయంలో జరుగు స్పాట్ అడ్మిషన్కు హాజరుకావాలని సూచించారు.

## ఆశ్రమ పాఠశాలకు ఎల్ఈడీ ప్రొజెక్టర్ వితరణ



**టీ మీడియా,జులై19, సింగరేణి (కారేపల్లి) :**

కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి అశ్రమ పాఠశాల కు బ్యాంకు అఫ్ బరోడా మేనేజర్ దారావత్ నరేష్ ఎల్ఈడీ ప్రొజెక్టర్ను వితరణ చేశారు. ట్రైబల్ వెల్ఫేర్ తెలంగాణ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.10వేల విలువైన ఎల్ఈడీ ప్రొజెక్టర్ను పాఠశాలకు అందజేశారు. గిరిజన బిడ్డల విద్యాభివృద్ధికి వితరణ చేయటం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కానిస్టేబుల్ కొర్ర కిరణ్కుమార్, ఉపాధ్యాయులు నరేష్, కిరణ్, బీ.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి మహిళలకు గోరింటాకు పోటీలు

**టి మీడియా, జూలై 19, పినపాక ప్రతినిధి:**

ఆషాడ మాసం సందర్భంగా మణుగూరు సింగరేణి ఏరియాలోని ఇల్లందు బంగ్లాస్ లేడీస్ క్లబ్ సభ్యులకు శనివారం గోరింటాకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఈ డబ్ల్యూ ఏ అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్ మాట్లాడుతూ, బంగ్లాస్ ఏరియాలోని లేడీస్ క్లబ్ సభ్యులకు ప్రతి ఏటా ఆషాడ మాసంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, అందులో భాగంగా ఈ సంవత్సరం నిర్వహించిన గోరింటాకు పోటీలకు , మహిళల నుండి విశేష స్పందన లభించింద న్నారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సెక్రటరీ కవిత వీరభద్రరావు, కవిత చారి, కరుణ లక్ష్మీపతి గౌడ్, శారద రామారావు, పాల్గొన్నారు.



## ప్లేస్మెంట్ పొందిన విజయ కళాశాల విద్యార్థులు

**టీ మీడియా, జూలై 19, కొణిజర్ల**

:స్థానిక విజయ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ ఇన్ష్యూర్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు వారు ఆన్ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ ని నాలుగో సంవత్సరం విద్యార్థులకు నిర్వహించారు. ఈ డ్రైవ్ లో వివిధ గ్రూపులకు చెందిన 35 మంది విద్యార్థులు ఏఐ ఇన్ష్యూర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ప్లేస్మెంట్ సాధించారు అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. వి.చిన్నయ్య తెలిపారు .అలాగే ఈ విద్యా సంవత్సరానికి ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకున్న విద్యార్థుల లో 150 కి పైగా కాగ్నిజెంట్, టిసిఎస్, ఎక్సరే, ఇన్ఫోసిస్, క్యు స్పైడర్, సై టెక్నాలజీ, ఏఐ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ మొదలగు సంస్థలలో ప్లేస్మెంట్ సాధించారు. కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ డైరెక్టర్ మరియు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఆయేషా తరణం కళాశాలలో ఆన్ క్యాంపస్ డ్రైవ్ ని నిర్వహించటం జరిగింది అని. కళాశాల వైస్ చైర్ పర్సన్ పి.విజయలక్ష్మి ప్లేస్ మెంట్ సాదించిన విద్యార్థులను అభినందించారు మరియు ఉద్యోగ అవకాశం కల్పించినందుకు విద్యార్థుల తరపున కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.బి టెక్ చివరి సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులలో 90% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు అని .ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. వి.చిన్నయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్.ఆయేషా తరుణం, డీన్ డాక్టర్. డి. శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్. ఫరీద్ బాబా మరియు వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## నయా నయీమ్

ఇక మీ భూమిలో ప్రభుత్వ భూమి కలిసి ఉన్నా సరే.. అసలు పూర్తిగా సర్కారు స్థలమే అయినా సరే.. చివరికి అది అసైన్డ్ భూమి అయినా ఫర్వాలేదు.. నేను చెప్పిన పేరిట రిజిస్ట్రేషన్ చేయండి.. అంతే చాలు.. మిగతాది నేనే చూసుకుంటా" అంటూ ఖమ్మంలో విలువైన భూములపై గద్దలా తిరుగుతున్నాడు. ఇలా భూములను అన్యాక్రాంతం చేసే క్రమంలో ఎలాంటి పరిణామాలకైనా తనదే బాధ్యత అంటూ భరోసా ఇస్తున్నాడు. రిజిస్ట్రేషన్ తర్వాత 60-40 పర్సంటేజీతో సెటిల్మెంట్ చేయడాన్ని ఇతను ఆనవాయితీగా మార్చుకున్నాడు. "రెండు రాష్ట్రాల్లో పోలీస్ పవర్ నా చేతిలో ఉంది.. రెవెన్యూలో ఎలాంటి రికార్డు కదలాలన్నా నాకు చిటికెలో పని.. మీరు రిజిస్ట్రేషన్ ఆఫీస్ కి వచ్చి నేను చెప్పిన పేరిట రిజిస్ట్రేషన్ చేస్తే అంతే చాలు.. భూమిపైకి వెళ్లేటప్పుడు ఎవరడ్డు వచ్చినా నేనే చూసుకుంటా.. పరిస్థితి చేయి దాటితే రౌడీలను రంగంలోకి దించుతా.. లోకల్ రౌడీలు సరిపోకపోతే హైదరాబాద్ నుంచి గుండాలను దించుతా.." క్లుప్తంగా ఇది ఆ భూ బకాసురుడి తీరు. భూముల అన్యాక్రాంతం కోసం ఎంతకైనా తెగించి, దేనికైనా బరితెగించడంలో అతను "ప్రవీణు"డు. ఖమ్మంలో నయా నయీమ్ తరహాలో రెచ్చిపోతున్న ఈ భూ బకాసురుడి వీర విహంగానికి రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతోంది. ఇతగాడి పోకడకు నివ్వెరపోవడం వ్యాపారులు , బాధితులవంతవుతోంది .

**ఎన్నారై కి భూమి రిజిస్ట్రేషన్**

భారతదేశాన్ని విడిచి విదేశీ పౌరసత్వం పొందిన ఎన్నారైలు ఇక్కడ ఆస్తులను కొనుగోలు చేసే విషయంలో చట్ట ప్రకారం కొన్ని నిబంధనలున్నాయి. అవేంటంటే.. ఎన్నారైగా ఉన్న వ్యక్తి భారతదేశంలో ఫార్మ్ హౌస్ గానీ, వ్యవసాయ భూమి కానీ, ప్లాంటేషన్ భూమి కానీ కొనుగోలు చేయకూడదు. ఇలా ఒక వేళ కొనుగోలు చేయాలంటే ఆర్బీఐ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. పర్మిషన్ లేకుండా కొనుగోలు చేస్తే భూమి విలువకు మూడు రెట్ల జరిమానాను భారత ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇలా ఎన్నారైలు కొనుగోలు చేసిన భూమిని మరొకరికి విక్రయించడం కూడా చట్ట ప్రకారం నిషిద్ధమే అవుతుంది. అలాంటి భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేసే "ప్రావీణ్యం" మన సిద్ధహస్తుడికే చెల్లుతోంది. జిల్లా కేంద్రానికి చుట్టూ 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న భూములు ధర పరంగా రెక్కలు తొడుక్కున్నాయి. దీంతో రియల్ భూ బకాసురులు భూముల అన్యాక్రాంతానికి ఎంతకైనా తెగిస్తున్నారు. ఖమ్మం నగరానికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నపాలెంలో ఈ కబ్జాకోరు ఒక ఎన్నారైకి చెందిన ఎనిమిదెకరాల భూమిపై కన్నేశాడు. ఈ భూమి కోర్టు వివాదంలో ఉన్నప్పటికీ ఒక బినామీ పేరిట జీపీఏ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈక్రమంలో ఆర్బీఐ నిబంధనలతో పాటు కోర్టు ధిక్కరణకు కూడా పాల్పడ్డాడు. ఒకవేళ వివాదం చోటుచేసుకుంటే రౌడీయిజాన్ని ప్రదర్శించడం, గుండాగిరీకి దిగడం కోసం మందీ మార్బలాన్ని సిద్ధం చేసుకున్నాడు. అలాగే ఈ భూమికి పక్కనే ఉన్న మరో వివాదాస్పద భూమిలో సైతం రూ.3 కోట్లను బయానా రూపంలో పుచ్చుకోవడం ఇప్పుడు మరింత వివాదాస్పదంగా మారింది. ఇలా వివాదాల్లో ఉన్న భూములను తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆ తర్వాత ఆ వివాదాన్ని మరింత పెంచి పెద్ద చేయడాన్ని ఇతగాడు తన నైజంగా మార్చుకున్నాడు. ఈక్రమంలో పోలీసింగ్, రెవెన్యూతో పాటు ఇతర ప్రభుత్వ యంత్రాంగాలను సైతం యధేశ్చగా వాడుకుంటూ, అవసరమైతే రౌడీలను రంగంలోకి దించి ప్రత్యర్థులను,బాధితులను బెంబేలెత్తిస్తున్నాడు.(మరికొన్ని వివరాలు మరో కథనం లో)

# ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

**-ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం**

**-ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం**

**టి మీడియా, జులై 19, ఖమ్మంబ్యూరో**

:పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలి.ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలి..ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు ఆధ్వర్యంలో ఖమ్మం ఉమెన్స్ కాలేజీ నుండి కాల్వ ఒడ్డు వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించడం జరిగింది... ఈ సందర్భంగాపి డి ఎస్ యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఉద్యమిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ లేక విద్యార్థులు అరిగోస పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం జాప్యం చేయకుండా వెంటనే పెండింగ్లో ఉన్న రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా విద్యార్థులకు ఒరిగింది శూన్యమన్నారు. సాక్షాత్తు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి జిల్లాకు సంబంధించిన వారు ఉన్న విద్యార్థులకు చిల్లి గవ్వ ఇవ్వలేదన్నారు. ఆంధ్ర ప్రాంత నాయకుడు విగ్రహాలకు, అందాల పోటీలకు తమ పార్టీ ప్రజా ప్రతినిధుల కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయలు ఇస్తూ విద్యార్థులను పట్టించుకోకపోవడం విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న బాధ్యత తెలియజేసిందన్నారు. టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ లేక విద్యారంగం నాశనం అవుతుందన్నారు. పేద విద్యార్థులకు చదువులు చెప్పేవారు కరువయ్యారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాలను గెస్ట్ లెక్చర్లను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు హాస్టల్స్ మరియు గురుకులాలకు సొంత భవనాలు ఏర్పాటు




చేయాలి కానీ ఈ జిల్లాలో ఉప ముఖ్యమంత్రి ఉండి విద్యారంగ సమస్యలను పరిష్కరించకుండా ఉండటం చాలా చుట్టు చోటు తక్షణ విద్య రంగ సమస్యలు పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సమస్యను పరిష్కరించిన యెడల పి డి ఎస్ యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో. గాంధీ అజయ్ శ్రీకాంత్ శ్రీలత అ శ్విన పాల్గొన్నారు.



## వ్యవసాయ శాఖ అవగాహన కార్యక్రమాలు

**టీ మీడియా,జులై19,మధిర:**

మండల పరిధిలోని మహదేవపురం,మడుపల్లి,మల్లవరం,వంగవీడు, దెందుకురు,జిలుగుమాడు, నాగవరప్పాడు , చిలుకూరు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై నానో యూరియా పై అవగాహన కార్యక్రమాలు కల్పించడం జరిగింది.ప్రస్తుత పరిస్థితులలో ఆయిల్ పామ్ పంట లాభదాయకమని ఒకసారి నాటితే 30 సంవత్సరం ల వరకు ఆదాయాన్ని ఇచ్చే పంట అని,కోతుల నుండి ప్రకృతి వైపరీత్యాల నుండి హాని లేని పంట అని,చీడ పీడలు తక్కువగా ఆశించే పంట అని,మార్కెటింగ్ సౌకర్యం ఉన్న పంట అని తెలిపారు. ప్రభుత్వం 200 రూపాయల విలువ గల మొక్కని రాయితీ మీద 20 రూపాయల కి ఇవ్వడం తో పాటు 4 సంవత్సరం ల పాటు నిర్వహణ ఖర్చుల కింద ప్రతి సంవత్సరం ఎకరాకు 4200 చొప్పున ఇస్తుంది. ఆయిల్ పామ్ పంటకుఎస్ సి , ఎస్ టి లకు 100 శాతం,బి సి లకు చిన్న సన్న కారు రైతులకు 90 శాతం,ఇతరులకు 80 శాతం రాయితీ పై డ్రిప్ పరికరాలు ఇవ్వడం జరుగుతుంది.ఈ విధంగా, ఆయిల్ పామ్ మొక్కలకు, తోట నిర్వహణ ఖర్చులకు నాలుగు సంవత్సరాల వరకు మరియు డ్రిప్ ఇరిగేషన్ కు, ఒక ఎకరానికి 50,918 రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారునానో యూరియాలినానో యూరియా వాడకం వలన మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని మరియు నానో యూరియా వాడకం వలన ఖర్చు తక్కువగాను మరియు పర్యావరణ కాలుష్యం తక్కువగా ఉంటుందని రైతులకు వివరించడం జరిగింది. 2- 4 %ఎశ్రీ% లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. అలానే ఒక బస్తా యూరియాలో ఎంత అయితే నత్రజని పోషకం ఉంటుందో అంతే నత్రజని పోషకం 1/2 లీటరు నానో యూరియా ద్వారా లభిస్తుందని తెలియజేశారు. అలాగే యూరియాని ఒకేసారి కాకుండా పంటలో దఫ దఫాలుగా వేసుకోవాలని సూచించారు. నానో యూరియా ని అన్ని రకాల పురుగుమందులతో కలిపి పిచికారి చేసుకోవచ్చని తద్వారా పంట పెట్టుబడి తగ్గుతుంది అని వివరించారుఈ కార్యక్రమంలో ఏఈవో లు గురుమూర్తి,జిష్ణు, నిఖిత ,సుష్మ,అమృత,రఘు,ప్రవల్లిక, వేణు ఆయా గ్రామల రైతులు పాల్గొన్నారు

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ

**టీ మీడియా,జులై19, ఖమ్మం:**

ఖమ్మం నగరంలోని 11వ డివిజన్ వరదయ్య నగర్ లో శనివారం లయన్స్ క్లబ్ ఖమ్మం ఆధ్వర్యంలో నిరుపేదలకు, కష్టజీవులకు, శ్రామికులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం లయన్స్ క్లబ్ అధ్యక్షులు, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కే జగదీష్ బాబు, జోన్ చైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దుర్గా నాగేశ్వరరావు, ట్రెజరర్ కృష్ణమూర్తి, లయన్ కొంకిమళ్ల విశ్వేశ్వరరావు, డాక్టర్ డి పి సి రావు, వి వెంకయ్య, వి హనుమంతరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఖమ్మం అధ్యక్షులు డాక్టర్ కే జగదీష్ బాబు, డా.బీఎస్ రావు తదితర ప్రముఖులు మాట్లాడుతూ.... అన్నదానం మహాదానం అన్నారు. సమాజంలో అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అన్నారు. ప్రపంచంలో ఎవరూ ఆకలి చావులకు గురి కాకూడదని లయన్స్ క్లబ్ భావిస్తుందన్నారు. అందుకే లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం చేయడం ఒక ప్రధాన కర్తవ్యం గా భావిస్తున్నామని అన్నారు.



## బోనమెత్తిన స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు

**-ఘనంగా సంబురాలు**

**-అమ్మవారు,పోతురాజులు వేషధారణతో కనువిందు...**

**టి మీడియా, జులై 19, ఖమ్మంబ్యూరో :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల వేడుకలు స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం నేత్ర పర్వంగా హోరెత్తాయి. బోనంను సంప్రదాయకరంగా తయారు చేసి, బోనాలతో పాఠశాల విద్యార్థులు అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి,పోతురాజు వేషధారణలతో విద్యార్థులు కనువిందు చేశారు. విద్యార్థులు విద్యార్థినిలు చీరకట్టు సాంప్రదాయ దుస్తులలో బోనాల సంబరాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ తమ ఇండ్లలలో బోనాలు తయారు చేసుకొని వచ్చిన విద్యార్థినిలు పురవీధుల్లో సాంప్రదాయ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి వేషధారణలతో, పోతురాజు వేషధారణలతో విద్యార్థినీ విద్యార్థులుఈ ఊరేగింపులో అగ్ర భాగాన ఉండి కనువిందు చేశారు. అనంతరం బోనాలను సమీప అమ్మవారి ఆలయంలో మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు విశిష్టమైన స్థానంతో పాటు కట్టు, బొట్టు, ఆచార వ్యవహారాలతో మహోన్నత స్థానం ఉందన్నారు. మారుమూల పల్లె నుంచి నగరం వరకు బోనాల సంబురాలు అంతట హోరు ఎత్తుతున్నాయని తెలిపారు. ఆషాడ మాసం, శ్రావణ మాసాలలో తెలంగాణ అంతట బోనాల సంబు రాలతో మురిసిపోతున్నాయని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులలో బోనాల విశిష్టతను తెలియజేసేందుకు పాఠశాలలో ప్రతి సంవత్సరం బోనాల సంబురాలని జరుపుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

